ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న క్రీడా రిజర్వేషన్ కోటాను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సిఆర్‌డిఏ)పై ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- రాష్ట్రంలో మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ అన్నారు.
- ఏజెన్సీ ప్రాంతాల్లో అన్ని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించి డోలీ మోతలను నివారిస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు.
- విజయనగరం జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు ఈరోజు నోటిఫికేషన్ విడుదలయ్యింది.

===================

ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న క్రీడా కోటా రిజర్వేషన్ ను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన క్రీడా విధానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. క్రీడల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు నాలుగు లక్ష్యాలతో పాలసీని సిద్ధం చేశారు. ఇందులో భాగంగా పలు ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. యూనిఫాం సర్వీసెస్ లో 3శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పాలసీలో ప్రతిపాదించారు. శాప్ లో గ్రేడ్ 3 కోచ్ ల కోసం ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించిన వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. పతకాలు సాధించే వారికి మంచి ప్రోత్సాహకాలు అందిస్తే క్రీడల పట్ల అందరికీ ఆసక్తి పెరుగుతుందని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఆటలు ఆడేవాళ్లకు గుర్తింపు, గౌరవం ఇవ్వాలని ఒలంపిక్, ఏషియన్ గేమ్స్ లో పతకాలు సాధించిన వారికి గ్రూప్-1 ఉద్యోగులుగా నియమిస్తామని తెలిపారు.

===================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర సచివాలయంలో ఈరోజు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సిఆర్‌డిఏ)పై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పురపాలక, నగరాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, సిఆర్‌డిఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్ష అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ సిఆర్‌డిఏ పనులకు సంబంధించి జులై 24న చీఫ్ ఇంజినీర్లతో సాంకేతిక కమిటీ వేశామని అక్టోబరు 29న ఆ కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. అన్ని పనులకు సంబంధించి డిసెంబర్ చివరిలోగా టెండర్లు పిలవాలని ఆదేశించామన్నారు. మూడు సంవత్సరాల్లో పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారని తెలిపారు. మంత్రులు, న్యాయమూర్తులు, ఇతర భవన సముదాయాలకు రూ.41 వేల కోట్లకు టెండర్లు పిలుస్తామని 30వేల కోట్ల రూపాయల టెండర్లకు సంబంధించి పనులు ఇప్పటికే మొదలయ్యాయని మంత్రి నారాయణ వెల్లడిస్తూ...

మంత్రి నారాయణ..వాయిస్ బైట్....

(వాయిస్ 40 సెకన్లు)

===================

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లాలోని గొల్లప్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, ఇతర ఉపకరణాలు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపడతామని పిఠాపురాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. అలాగే పోలీసు ఉన్నతాధికారులు రాష్ట్రంలోని శాంతిభద్రతలకు బాధ్యత వహించాలని ఆడపిల్లలు, మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ అన్నారు.

===================

ఏజెన్సీ ప్రాంతాల్లో అన్ని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించి డోలీ మోతలను నివారిస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంచార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. ఈరోజు పాడేరు మండలంలో పర్యటించి బంగారు మెట్ట గ్రామంలో ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ 46 కోట్ల రూపాయలతో సీలేరు రోడ్డును అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరు చేసిందని తెలిపారు. గిరిజన ప్రాంతాలకు మరో 35 అంబులెన్సులు మంజూరు చేస్తామని అన్నారు. గిరిజన గ్రామాలకు సోలార్ విద్యుత్తు సదుపాయం కల్పించడానికి ప్రభుత్వం అలోచన చేస్తోందన్నారు. ప్రతీ గ్రామానికి సాగు, త్రాగు నీరు అందించాలని.. అధికారులు ఈ అంశాలపై మరింత దృష్టి సారించాలని మంత్రి సంధ్యారాణి పేర్కొంటూ ...

మంత్రి సంధ్యారాణి వాయిస్ బైట్ (25 సెకన్లు)

===================

విరామం

===================

విజయనగరం జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు ఈరోజు నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు స్వీకరణ ప్రారంభమయ్యింది. ప్రతిరోజు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సంయుక్త కలెక్టర్, రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్ ఛాంబర్‌లో నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబరు 11న మధ్యాహ్నం వరకు నామినేషన్లు స్వీకరణ, 12న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 14వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేద్కర్ తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం పార్వతీపురం, విజయనగరం ఆర్.డి.ఓ. కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 28వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగుతుందని ఓట్ల లెక్కింపు డిసెంబరు 1న చేపడతామని కలెక్టర్ వెల్లడించారు.

===================

దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలపై ఈనెల 22, 23 తేదీలలో 6వ జాతీయస్థాయి మహిళా సదస్సు విజయవాడ నగరంలో జరగనుందని శాసనమండలి సభ్యులు కె. లక్ష్మణరావు తెలిపారు. విజయవాడ గాంధీనగర్ లోని ఎన్జీవో హోమ్ లో మహిళా సమావేశ నిర్వహణకు సంబంధించిన లోగో, గోడ పత్రికను ఆయన ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల కాలంలో దేశంలోని మహిళల్లో ఆత్మస్థైర్యం పెరగడం శుభ పరిణామన్నారు. గత మూడు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందేలా అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.

===================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా సంయుక్త కలెక్టరు ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. ప్రజలు తెలియజేసిన సమస్యల గురించి వివరాలను అధికారులను అడిగి వెంటనే తెలుసుకున్నారు. ప్రజల నుండి వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీచేసారు. అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలని, అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలని తెలిపారు. ఈరోజు అనకాపల్లి జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సంయుక్త కలెక్టరు ఎం. జాహ్నవితో పాటు జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, ASDC సుబ్బలక్ష్మి, హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు శ్రీనివాసరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

===================

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం ఈరోజు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదల చేయనున్నామని నవంబర్ 18వరకు నామినేషన్లు స్వీకరించి.. 19న నామినేషన్ల పరిశీలన చేపడతామని ఎన్నికల సంఘం వెల్లడించింది. డిసెంబర్ 5వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించి, డిసెంబర్ 9న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నామని ఆ ప్రకటనలో తెలిపారు. గతంలో తూర్పుగోదావరి- పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ తరఫున గెలిచిన యూటీఎఫ్ నాయకులు షేక్ సాబ్జీ గతేడాది డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

===================

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 28 నుండి డిసెంబరు 6వ తేదీ వరకు జరగనున్న కార్తీక బ్రహ్మోత్సవాల రోజువారి కార్యక్రమాల బుక్ లెట్ ను ఈరోజు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో జె.శ్యామలరావు ఆవిష్కరించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో జరిగినా కార్యక్రమంలో ఈవో మాట్లాడుతూ శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబరు 28వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయన్నారు. డిసెంబరు 2వ తేదీన గజవాహనం, 3వ తేదీన బంగారు రథం, 5వ తేదీన రథోత్సవం, డిశెంబరు 6వ తేదీన పంచమితీర్థం వుంటుందని తెలిపారు.

===================

===================